
ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 310 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 14 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## పేపర్ లీకుల నిరోధక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

2లో..

### కోటి ఇళ్లకు
## ఉచిత విద్యుత్



2

### బీజేపీలో చేరిన
## మాజీ సీఎం



2

### యూఏఈలో
## యూపీఐ రూపే కార్డు



2



## చివరి శ్వాస వరకు పులిలా కొట్లాడతా



### అన్యాయాన్ని ఊరుకునేది లేదు..
### పాలిచ్చే గేదెను వద్దని దున్నపోతును తెచ్చుకున్నారు
### ఘాటు వ్యాఖ్యలు.. నిప్పులు చెరిగిన కేసీఆర్

నల్గొండ, ఫిబ్రవరి 13 (ప్రభాత ఉదయం): రైతుబంధు ఇవ్వడం కూడా చాతకావడం లేదా ఇంత దద్దమ్మలా అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్. కేసీఆర్‌ను నల్గొండలో తిరగనివ్వరా.. కేసీఆర్ చంపి మీరు వుంటారా అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇది రాజకీయ సభ కాదు.. పోరాట సభ అన్నారు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్. మంగళవారం నల్గొండలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. కృష్ణాజలాలు మన జీవనర్మరణ సమస్య అన్నారు. బీఆర్ఎస్ వచ్చాక నల్గొండను ఫ్లోరైడ్ రహితంగా మార్చుకున్నామని.. భగీరథ నీళ్లతో ఫ్లోరైడ్ బాధలు పోయాయన్నారు. మా బతుకు ఇది అని చెప్పినా గతంలో ఏ పార్టీ పట్టించుకోలేదని కేసీఆర్ గుర్తుచేశారు. కొందరు సన్నాసులు తెలివిలేక ఈ సభ వారికి వ్యతిరేకం అనుకుంటున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నీళ్లు లేకపోతే మనకు బతుకు లేదన్నారు.. గతంలో ఫ్లోరైడ్‌తో నల్గొండ జిల్లా వాసుల నడుములు వంగిపోయాయని కేసీఆర్ గుర్తుచేశారు. మనల్ని మనం కాపాడుకునే

..మిగతా 2లో

### కోటి ఎకరాలకు నీళ్లు
## పచ్చి అబద్ధం

### దోచుకున్న సొమ్ము కక్కిస్తాం
### నల్గొండకు కాదు, అసెంబ్లీకి రండి
### కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి కౌంటర్



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటరిచ్చారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కాలు విరిగిందని సానుభూతితో ఓట్లు పొందాలని చూస్తున్నారని.. అసలు కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించిందే కేసీఆర్ అని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం తన తప్పులు కప్పిపుచ్చుకోవాలని చూసిందన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన మేడిగడ్డ బ్యారేజ్‌లో పిల్లర్ కుంగిన ప్రదేశాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. మేడిగడ్డ కుంగినప్పుడు తాము రావాలనుకుంటే అప్పటి ప్రభుత్వం రానివ్వలేదన్నారు. కాలు విరిగిందని సభకు కేసీఆర్ రాలేదని.. నల్గొండ దగ్గర వుందా, అసెంబ్లీ దగ్గర వుందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ అంత సత్యహరిశ్చంద్రుడైతే అసెంబ్లీకి ఎందుకు రాలేదని ఆయన నిలదీశారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ సర్కారే కేఆర్ఎంబీ అప్పగించిందని అబద్ధాలు ప్రచారం చేశారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగైదు పిల్లర్లు కూలితే తప్పా అని కేసీఆర్ అంటున్నారని.. ఎమ్మెల్యేల ప్రాజెక్ట్ సందర్శనను చులకన చేసి మాట్లాడటం మరింత దిగజారుడుతనమని రేవంత్ ఎద్దేవా చేశారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చినా అని ఒక కోటి ఒకసారి కేసీఆర్ అబద్ధం చెప్పారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ దోపిడికీ మేడిగడ్డ బలైపోయిందని, అన్నారం , సుందిళ్ల

..మిగతా 2లో



### కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు ఎందుకు
## కోరడం లేదు?
### కాంగ్రెస్‌కు కిషన్ రెడ్డి సూటి ప్రశ్న

వరంగల్, ఫిబ్రవరి 13 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం ముందుకు వస్తే.. కాళేశ్వరంపై దర్యాప్తు చేయడానికి సీబీఐ సిద్ధంగా ఉందని కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. గత సీఎం, బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కోరడంలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. వరంగల్ పర్యటనలో హనుమకొండలోని స్తంభాల గుడి కళ్యాణ మండపం, వరంగల్లోని కాకతీయ జరుగుతున్న పనులను మంత్రి కిషన్ రెడ్డి సందర్శించారు. కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన నాణ్యత, ప్లానింగ్, డిజైనింగ్ అక్రమాలను బయటపట్టడానికి విజిలెన్స్‌కు సామర్థ్యం ఉండదన్నారు. బీఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మేము వివరాలు కోరితే.. మాదగ్గర


..మిగతా 2లో

### ఢిల్లీ సరిహద్దుల్లో
## రణరంగం
### రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): ఢిల్లీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన రైతు సంఘాలను పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీ వైపు వస్తున్న పంజాబ్, హర్యానా రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో జాతీయ రహదారిలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పంజాబ్, హర్యానా సరిహద్దు శింభూలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఢిల్లీ సరిహద్దుల

..మిగతా 2లో



## ఏసీబీ వలలో శామీర్‌పేట తహసీల్దార్
### రూ.10 లక్షల డిమాండ్..

మేడ్చల్, ఫిబ్రవరి 13 (ప్రభాత ఉదయం): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట తహసీల్దార్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వలకు చిక్కారు. రూ.10 లక్షలు లంచం తీసుకుంటూ మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణ ఏబీసీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ వ్యక్తికి సంబంధిచిన భూమికి పట్టాదారు పాసుబుక్ జారీ చేసేందుకు సదరు తహసీల్దార్ రూ.10 లక్ష లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా.. పక్కా ప్రణాళికతో సత్యనారాయణ డ్రైవర్ డబ్బులు తీసుకునే క్రమంలో రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకున్నారు. అయితే తహసీల్దార్ సత్యనారాయణ తీసుకోమని చెబితేనే తాను లంచం డబ్బు తీసుకున్నానని డ్రైవర్ తెలిపారు. దీంతో ఏసీబీ అధికారులు.. తహసీల్దార్ సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు.

# చివరిశ్వాస వరకు పులిలా కొట్లాడతా



**మొదటి పేజీ తరువాయి...**

ప్రయత్నం చేయకపోతే ఎవరూ మన రక్షణకు రారని ఆయన అన్నారు. ఇది కొంతమందికి వ్యతిరేకంగా పెట్టిన సభ కాదని కేసీఆర్ పేర్కొన్నారు. పదేళ్లలో నేనేం తక్కువ చేయలేదని.. ఓటు సమయంలో నంగనాచి కబుర్లు చెబుతారని, తర్వాత ఎవరూ రారన్నారు. ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రజల జీవన్మరణ సమస్య ఇదని కేసీఆర్ అన్నారు. మన నీళ్లు కాజేద్దామనుకునే స్వార్థపరులకు ఈ సభ ఓ హెచ్చరిక అని.. ఎక్కడి నుంచో కరెంట్ తెప్పించి విద్యుత్ కోతలు లేకుండా చేశామని ఆయన గుర్తుచేశారు. బస్వాపూర్ పూర్తయ్యిందని.. దిండి ప్రాజెక్ట్ కూడా పూర్తి కాబోతోందని కేసీఆర్ తెలిపారు. నా గడ్డ, నా ప్రజలు, నా ప్రాంతం అనుకుంటే ఏమైనా సాధించొచ్చునని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు వందలకొద్దీ కేసులు వేసినా ముందుకెళ్లామని కేసీఆర్ చెప్పారు. ఇది చిల్లరమల్లర రాజకీయ సభ కాదని.. గోదావరి , కృష్ణా కలిపి మంచిగా నీళ్లు తెచ్చుకున్నామని ఆయన వెల్లడించారు. పాలమూరు ఎత్తిపోతల పూర్తయితే పాలమూరు, వికారాబాద్, రంగారెడ్డి ప్రజలకు లబ్ధి కలుగుతుందని కేసీఆర్ తెలిపారు. వారం రోజులు లోక్‌సభను అడ్డుకున్నాం, స్తంభింపజేశామని ఆయన పేర్కొన్నారు. కేంద్రం చెబితేనే కేసు విత్ డ్రా చేసుకున్నామని.. కేంద్రంతోనూ కొట్లాడి ప్రాజెక్ట్‌లపై ముందుకు సాగామని కేసీఆర్ వెల్లడించారు. మీరు పాలిచ్చే గేదెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేం చలో నల్గొండ అనగానే అర్జంటుగా బడ్జెట్‌ను పక్కకుపెట్టి సభలో తీర్మానం పెట్టారని కేసీఆర్ అన్నారు. తాము ప్రజల్లోనే తేల్చుకుంటామని చలో నల్గొండకు పిలుపునిచ్చామని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రమే బాగుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారని.. ప్రజల హక్కులు గాలికి వదిలేసి అసెంబ్లీలో దుర్మార్గంగా మాట్లాడుతున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం పాత ప్రభుత్వం కంటే నాలుగు మంచి పనులు చేయాలని .. కేసీఆర్‌ను తిడితే కాంగ్రెస్ నేతలు పెద్దోళ్లు అవుతారా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యతను ప్రజలు మాకు ఇచ్చారని.. ఎక్కడికక్కడ నిలదీస్తామని కేసీఆర్ తెలిపారు. రైతుబంధు ఇవ్వడం కూడా చాతకావడం లేదా ఇంత దద్దమ్మలా అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ చేసిన తీర్మానంలో సాగునీరు అన్నారు.. కరెంట్ ఉత్పత్తి సంగతి మరచిపోయారని కేసీఆర్ దుయ్యబట్టారు. ఎవరికీ అధికారం శాశ్వతం కాదని, తెలంగాణ ప్రజల హక్కులు శాశ్వతమని ఆయన పేర్కొన్నారు.

దద్దమ్మలు , చేతగాని చవటలు వుంటే ఇంతే అవుతుందని కేసీఆర్ ఎద్దేవా చేశారు. మేం ఏం చేశామో తెలంగాణ ప్రజలు కళ్లారా చూశారని .. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలంటారా.. ఎన్ని గుండెలురా మీకు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక 24 గంటల కరెంట్ ఇచ్చామని.. కేసీఆర్ ప్రభుత్వం పోగానే మళ్లీ కరెంట్ కోతలు మొదలయ్యాయని ధ్వజమెత్తారు. అసెంబ్లీలోనూ జనరేటర్ పెట్టారంటూ దుయ్యబట్టారు.

నీటిదురుసుతో మాట్లాడతారా.. చెప్పులు పంటలు పండించే రైతులకు కూడా వుంటాయన్నారు. కేసీఆర్‌ను నల్గొండలో తిరగనివ్వరా.. కేసీఆర్ చంపి మీరు వుంటారా అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. పులిలా పోరాడతా తప్పించి.. పిల్లిలా వెనకడుగు వేయనని కేసీఆర్ స్పష్టం చేశారు. తాము వున్నప్పటి కంటే 5,600 మెగావాట్ల పవర్ అధికంగా వున్నా.. పవర్ కట్స్ ఎందుకు వున్నాయని ఆయన ప్రశ్నించారు. రైతుల చెప్పులు బందోబస్తుగా వుంటాయని ఒక్క చెప్పుదెబ్బతో మూడు పళ్లు పోతాయని హెచ్చరించారు.

మాయమాటలు చెప్పి తిరగాలని అనుకుంటున్నారా తిరగనివ్వం జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. బ్రిజేష్ ట్రిబ్యూనల్‌లో మన వాటా మనకు దక్కే వరకూ పోరాడాల్సిందేనని కేసీఆర్ పిలుపునిచ్చారు. మీకు చేతకాకపోతే.. కావట్లేదని చెప్పాలన్నారు. అసెంబ్లీ అయ్యాక మేము కూడా మేడిగడ్డ వెళ్లి మీ చరిత్ర బయటపెడతామని కేసీఆర్ పేర్కొన్నారు. వెంటపడతాం.. వేటాడతాం.. వదిలిపెట్టమని ఆయన హెచ్చరించారు. మరో 2 , 3 నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు వుంటాయని కేసీఆర్ పేర్కొన్నారు. చావుదాకా పోయి తెలంగాణ తెచ్చానని.. ఆ తపన, ఆవేదన తనకు వున్నాయన్నారు. రైతుబంధు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం మీది అంటూ కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌లో ఒక్క పిల్లర్ కుంగితే ఏమైందని అని ఆయన ప్రశ్నించారు. మన న్యాయపరమైన హక్కులపై పోరాటానికి సిద్ధంగా వుండాల్సిందే, అన్ని పార్టీల నాయకులకు ఢిల్లీకి తీసుకెళ్లాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. 24 ఏళ్లుగా ప్రజల్లోనే వున్నా.. ఇప్పుడు అపోజిషన్‌లో రెస్ట్ తీసుకుందామనుకున్నా కుదరనివ్వట్లేదన్నారు.



# ఢిల్లీ సరిహద్దుల్లో రణరంగం

**మొదటి పేజీ తరువాయి...**

వెంబడి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. రహదారి పొడవునా పోలీసులను మోహరించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం కోసం కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. డ్రోన్లతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పంటల కోసం కనీస మద్దతు ధర చట్టం రూపొందించడం, 2020లో చేపట్టిన ఆందోళనకు సంబంధించిన కేసులు కొట్టివేతకు సంబంధించి రైతులు నిరసన చేపట్టారు. భారీ ఎత్తున ట్రాక్టర్లలో ర్యాలీ చేపట్టారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వందల ట్రాక్టర్లతో రైతులు ఢిల్లీకి బయలుదేరారు. ఈ ర్యాలీకి కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ మద్దతు పలికింది. చర్చలతో తమ డిమాండ్లను పరిష్కరిచుకోవాలని భావిస్తున్నట్లు ఆ కమిటీ జనరల్ సెక్రటరీ శర్వణ్ సింగ్ తెలిపారు. ఇదిలా ఉంటే రైతుల ఆందోళనను భగ్నం చేసేందుకు ప్రయత్నించారు పోలీసులు. జాతీయ రహదారులపై రెండు, మూడు అంచెల బారికేడ్లు ఏర్పాటు చేశారు. పంజాబ్, హర్యానా, ఢిల్లీ సరిహద్దుద ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు. ఈ నిరసనల నేపథ్యంలో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పలు మెట్రో సేవలను నిలిపి వేశారు అధికారులు.



# కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్

## 'సూర్య ఘర్'ను ప్రారంభించిన మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్య పౌరులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించేలా ఈసారి బడ్జెట్‌లో కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దాని అమలుదిశగా కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్తును అందించేందుకు వీలుగా 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ప్రకటన చేశారు. ఇందుకోసం సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత స్థిరమైన అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని ప్రారంభిస్తున్నాం. రూ.75 వేల కోట్ల పెట్టుబడితో తీసుకొస్తున్న ఈ ప్రాజెక్ట్‌తో.. ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించి కోటి కుటుంబాల్లో వెలుగులు నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీని కింద అందించే సబ్సిడీలను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి భారీ రాయితీపై రుణాలు పొందొచ్చు. ప్రజలపై ఎలాంటి వ్యయభారం ఉండదని హామీ ఇస్తున్నాం" అని ప్రధాని మోదీ 'ఎక్స్ (ట్విటర్)'లో వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఈ పథకానికి ప్రచారం తీసుకొచ్చేందుకు.. పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీలకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. వారు తమ పరిధిలో ఈ రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ప్రోత్సహించాలని సూచించారు. ఈ పథకంతో విద్యుత్ బిల్లులు తక్కువ రావడంతో పాటు ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు. "సౌరశక్తిని, స్థిరమైన అభివృద్ధిని మరింత విస్తృతం చేద్దాం. గృహ వినియోగదారులు, ముఖ్యంగా యువత ఈ 'సూర్య ఘర్' పథకాన్ని బలోపేతం చేయాలని కోరుతున్నా. ఇందుకోసం %జూఎంబతీఖుస్త్రష్ఠుతీ.స్త్రశీఱ.ఱఅ%లో దరఖాస్తు చేసుకోవచ్చు" అని మోదీ వెల్లడించారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# బీజేపీలో చేరిన మాజీ సీఎం

ముంబై, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ కాంగ్రెస్ వీడి కాషాయం గూటికి చేరారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో బీజేపీలో చేరారు.కాంగ్రెస్‌లో 38 ఏళ్ల పదవీకాలం తర్వాత బీజేపీలో చేరిన కొద్దిసేపటికే, వేదికపై మాట్లాడుతున్న అశోక్ చవాన్ స్లిప్ అయ్యారు. అశోక్ చవాన్ ముంబై బీజేపీ చీఫ్ ఆశిష్ షెలార్‌ను 'ముంబయి కాంగ్రెస్ అధ్యక్షుడు' అని పొరపాటుగా పిలిచారు. దీంతో డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సహా అక్కడున్న వారంతా ఒక్కసారిగా నవ్వుకున్నారు. ముంబైలో బీజేపీలో చేరిన అనంతరం చవాన్ మీడియాతో మాట్లాడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గట్టిగా నవ్వే ముందు సర్దిచెప్పడం కనిపించింది. చేసిన తప్పుకు క్షమాపణలు చెప్పిన చవాన్.. 'ఇప్పుడే బీజేపీలో చేరాను.. అందుకే తప్పు చేశాను.. 38 ఏళ్ల కాంగ్రెస్‌లో ఉన్న తర్వాత బీజేపీలో చేరి కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్నాను' అంటూ చవాన్ చమత్కారంతో తప్పును సర్ది చెప్పుకున్నారు. తాను ఎల్లప్పుడూ సానుకూల రాజకీయాలలో భాగంగా ఉంటానని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకువస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుకున్నట్లు ప్రకటించారు అశోక్ చవాన్. 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' అంటూ ప్రతిజ్ఞ చేశారు. కొన్నిసార్లు మోదీని వ్యతిరేకించలేదని ఆరోపణలు వచ్చాయి. కానీ ఎప్పుడూ సానుకూల రాజకీయాలు చేశాను. అంటూ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ అశోక్ చవాన్‌పై ప్రశంసలు కురిపించారు. మహారాష్ట్ర రాష్ట్రంలో సీనియర్ నాయకత్వం బీజేపీలోకి చేరుతోంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలిచారు. వివిధ మంత్రి పదవులు నిర్వహించి రెండు సార్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన అశోక్ చవాన్ బీజేపీలో చేరుతున్నట్లు ఫడ్నవీస్ తెలిపారు. దేవేంద్ర ఫడ్నవీస్ కూడా అశోక్ చవాన్ నుండి ఎక్కడ సహాయం తీసుకోవాలో మాకు బాగా తెలుసు అని అన్నారు ఫడ్నవీస్.

# యూఏఈలో యూపీఐ రూపే కార్డు

## సేవలను ప్రారంభించిన ప్రధాని మోదీ

అబుదాబి, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో కలిసి ఆ దేశంలో యూపీఐ రూపే కార్డు సేవలను ప్రారంభించారు. మంగళవారం ఉదయం భారత్ నుంచి బయలుదేరిన ప్రధాని మోదీ.. సాయంత్రం యూఏఈ రాజధాని అబుదాబికి చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో కలిసి ఆ దేశంలో యూపీఐ రూపే కార్డు సేవలను ప్రారంభించారు. మంగళవారం ఉదయం భారత్ నుంచి బయలుదేరిన ప్రధాని మోదీ.. సాయంత్రం యూఏఈ రాజధాని అబుదాబికి చేరుకున్నారు. అబుదాబిలో అడుగుపెట్టిన ప్రధానికి ఘన స్వాగతం లభించింది. యూఏఈ సైన్యం ప్రధానికి గౌరవ వందనం సమర్పించింది. అనంతరం యూఏఈ అధ్యక్షుడు షేక్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్.. ప్రధాని మోదీని ఆలింగనం చేసుకుని అబుదాబిలోని తన అధికారిక నివాసంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల అధినేతల మధ్య ద్వైపాక్షిక అంశాలపై చర్చ జరిగింది.



# కోటి ఎకరాలకు నీళ్లు పచ్చి అబద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

సున్నమైపోయాయన్నారు. ప్రాజెక్ట్‌ల డిజైన్స్, నిర్మాణం, నిర్వహణలో లోపాలు వున్నాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. నల్గొండలో సభ పెట్టి కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేయాలని కేసీఆర్ చూశారని సీఎం దుయ్యబట్టారు. ఈ ప్రాజెక్ట్‌పై ఎన్నో అనుమానాలు వున్నాయని, ఎమ్మెల్యేలతో కలిసి వెళ్దామని లేఖ రాశామని ఆయన తెలిపారు. ఉత్తమ్ తీర్మానంలో లోపాలు వున్నాయని అంటున్నారని.. దానికి మీ అల్లుడు హరీశ్ రావు ఎందుకు మద్దతు ఇచ్చారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌కు పార్టీలో విలువలేదని.. అందుకే కేసీఆర్ సభకు రావాలని తాము కోరామన్నారు. కాగ్ నివేదిక కూడా వేల కోట్ల దోపిడీ జరిగిందని చెప్పిందని.. అసెంబ్లీలో మీ అవినీతిపై చర్చ పెట్టామన్నారు. కుంగిపోయిన మేడిగడ్డపై ఇంతవరకూ కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని రేవంత్ నిలదీశారు. తీర్మానంలో లోపాలు వుంటే.. మీరు సభకు వచ్చి ఎందుకు సవరించలేదన్నారు. ఇప్పుడు కూడా బెదిరించి బతకాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధాలను నమ్మడానికి తెలంగాణ సమాజం సిద్ధంగా వుందనుకుంటున్నారా అని రేవంత్ రెడ్డి నిలదీశారు. కాళేశ్వరం అవినీతిలో మీకు సంబంధం లేకుంటే, ఎందుకు సభకు రావడం లేదని సీఎం ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా మీ గౌరవాన్ని ఎక్కడా తగ్గించమని, రేపు సభకు హాజరుకావాలని రేవంత్ కోరారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీళ్లు నింపితే ఏ క్షణంలోనైనా కుప్పకూలిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్ద పగుళ్లు వస్తే.. చిన్న సమస్య అంటారా అంటూ రేవంత్ ఫైర్ అయ్యారు . సాగునీటి ప్రాజెక్ట్‌లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రవేశపెట్టే శ్వేతపత్రంపై చర్చలో పాల్గొనాలని ఆయన కోరారు. ఎల్ అండ్ టీ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలా , వద్దా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ సభకు వస్తే.. ఎంతసేపు మాట్లాడినా సమయం ఇవ్వమని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని సీఎం తెలిపారు. బీజేపీ నేతలు సీబీఐ ఎంక్వైరీ అడుగుతున్నారని.. మూడు బ్యారేజ్‌ల్లో ఎక్కడా నీళ్లు లేవన్నారు . నీళ్లు నింపితే కానీ , భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వస్తాయో తెలియదని రేవంత్ పేర్కొన్నారు. కాళేశ్వరంపై లక్ష కోట్లు ఖర్చు పెట్టినా లక్ష ఎకరాలకు కూడా నీరు అందలేదన్నారు. లక్ష ఎకరాలకు నీరు అందకపోయినా. . కేసీఆర్ మాత్రం కోటి ఎకరాలకు నీరు ఇచ్చామని గొప్పలు చెప్పారని ఆయన దుయ్యబట్టారు. నిర్మాణంలో నాణ్యతా లోపం వుందని డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ సమస్యను నిర్లక్ష్యం చేశారని సీఎం ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ఏటా విద్యుత్ బిల్లులే రూ.10,500 కోట్లు వస్తున్నాయని.. రుణాలు , ఇతర ఖర్చులు కలిపి ప్రతి ఏటా రూ.25 వేల కోట్లు అవసరమవుతాయని రేవంత్ రెడ్డి వివరించారు. రీడిజైన్ పేరుతో కాళేశ్వరం చేపట్టి.. భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ నల్గొండలో సభ పెట్టారని రేవంత్ ఆరోపించారు. రెండు సార్లు అధికారమిస్తే.. ప్రాజెక్ట్‌ల పేరుతో దోచుకున్నారని దుయ్యబట్టారు. సీఎం కుర్చీ చేజారగానే.. నీళ్లు, ఫ్లోరైడ్ బాధితులు గుర్తొచ్చారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్దకు వచ్చేందుకు ఎందుకు భయపడుతున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాలు విరిగిందని సానుభూతితో ఓట్లు పొందాలని చూస్తున్నారని.. అసలు కృష్ణా ప్రాజెక్ట్‌లను కేంద్రానికి అప్పగించిందే కేసీఆర్ అని సీఎం తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు కొత్త ఎత్తు వేశారని.. ప్రజల కోసం బయటకు వెళ్లే అలవాటు కేసీఆర్‌కు లేదని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు.

# పేపర్ లీకుల నిరోధక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): పోటీ పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. పబ్లిక్ పరీక్షల అక్రమ మార్గాల నిరోధక బిల్లు-2024 పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ, రాజ్యసభ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రవేశ పరీక్షలన్నింటిలో అక్రమాలను అరికట్టడం, అవకతవకలపై దర్యాప్తు చేయడమే ఈ చట్టం ఉద్దేశం. ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో పారదర్శకత, విశ్వసనీయత తీసుకువచ్చే ఉద్దేశంతో బిల్లును కేంద్రం రూపొందించింది. ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలుపగా.. అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నుంచి ఇది అమల్లోకి రానున్నది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఏదైనా పేపర్ లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లు తెరిచినా గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ తదితర పోటీ పరీక్షలతో పాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ఎంట్రన్స్ టెస్టులకు సైతం చట్టం వర్తిస్తుంది. అయితే, గత కొన్నేళ్లుగా ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, అభ్యర్థుల నష్టపోయారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో పేర్కొన్నారు. దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్న ఆయన.. చర్యలు తీసుకోకపోతే లక్షలాది మంది యువత భవిష్యత్తుతో ఆడుకున్నట్లేనన్నారు.

# నేడు రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

## రేపే నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ

## మూడింటిలో 2 కాంగ్రెస్‌కు, 1 బీఆర్ఎస్‌కు

హైదరాబాద్, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): రాష్ట్రం నుంచి ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బుధవారం తమ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నది. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు అధికార కాంగ్రెస్ పార్టీకి, ఒకటి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు దక్కనున్నది. నామినేషన్ల దాఖలుకు గురువారం చివరి తేదీ కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులను బుధవారం ప్రకటించే చాన్స్ ఉన్నది. ఈ నెల 11 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైనప్పటికీ అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు కాలేదు. కాంగ్రెస్ పార్టీకి రెండు రాజ్యసభ సీట్లు దక్కనుండగా అందులో ఒకటి ఏఐసీసీ కోటా నుంచి, మరొకటి టీపీసీసీ నుంచి ఎంపిక చేయనున్నట్టు అధిష్ఠానం ఇదివరకే నిర్ణయించినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. ఏఐసీసీ కోటాలో రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇందులో ఒకరు ఏఐసీసీ కోశాధికారి, సీడబ్ల్యూసీ సభ్యుడు అజయ్‌మాకెన్ కాగా, మరొకరు కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో సభ్యురాలు సుప్రియ ఉన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేసేది బుధవారం తేలిపోనున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ మంత్రి, పీసీసీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, మాజీ మంత్రి కే జానారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు వీ హనుమంతరావు, చల్లా వంశీచందర్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. రాజ్యసభకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యే అభ్యర్థిని ఇప్పటికే అధిష్ఠానం ఎంపిక చేసిందని, ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల పార్టీ గోప్యంగా పెట్టి ఉంటుందని కూడా అంటున్నారు.

# కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదు?

**మొదటి పేజీ తరువాయి...**

వివరాలు లేవని ప్రాథమిక సమాచారం ఇచ్చారని.. డ్యామ్ సేఫ్టీ అథారిటీ దేశవ్యాప్తంగా ప్రాజెక్టుల రక్షణ చూస్తుందన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని వార్తలు రాగానే.. వెంటనే అక్టోబర్ 22న తాను కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాసినట్లు కిషన్ రెడ్డి గుర్తుచేశారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించిందని, అప్పుడే పిల్లర్లు కుంగిపోయాయని, ప్రాజెక్టు నాణ్యతపై దర్యాప్తు చేపట్టి.. చర్యలు తీసుకోవాలని నేను ఉత్తరం రాశానన్నారు. తర్వాతి రోజే.. భారత ప్రభుత్వ జలశక్తి శాఖ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి మేడిగడ్డకు పంపామని తెలిపారు. అక్టోబర్ 24, 25న ఆ రెండు రోజులు డ్యామ్ సేఫ్టీ అథారిటీ రాష్ట్ర అధికారులను వివరాలు అడిగిందని చెప్పారు. గతేడాది నవంబర్1న డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఒక ప్రాథమిక నివేదిక తయారు చేసి రాష్ట్రానికి పంపింది. దాని ప్రకారం ప్రాజెక్టు సర్వే, ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, ఆపరేషన్, నిర్వహణ ఏదీ సరిగ్గా లేవని వెల్లడించిందని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రమాదకర పరిస్థితిలో డ్యామ్ ఉన్నదని, నీటిని ఖాళీ చేయాలని డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించింది. డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన తర్వాత.. నాటి బీఆర్ఎస్‌ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా మేము లేఖలు రాసినా.. ఎలాంటి స్పందన లేదని కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు తప్ప, కాంగ్రెస్ చేతలు లేవని ఎద్దేవా చేశారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ వివరాలు అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం వివరాలు ఇవ్వడం లేదు. మళ్లీ సందర్శనకు వస్తామంటే కూడా రాష్ట్ర సర్కారు అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష పార్టీ, పాలక పార్టీ కూడబలుక్కొని నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. మేడిగడ్డ ప్రమాదంలో ఉందని తెలిసినా.. ఈ రెండు నెలల సమయం రాష్ట్ర ప్రభుత్వం వృథా చేసిందన్నారు. విజిలెన్స్ దర్యాప్తు అంటున్న రాష్ట్ర సర్కారు... విజిలెన్స్ ఏం చేయగలదో సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. విజిలెన్స్ నివేదిక అని చెప్తున్న ప్రభుత్వం.. అది నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు ఇచ్చిన నివేదికనే పొందుపరిచారని గుర్తుచేశారు.. మేడిగడ్డ డ్యామేజీ వ్యవహారాన్ని పొలిటికల్ మైలేజ్ కోసం కాంగ్రెస్ వాడుకుంటోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ బంద్ పెట్టి.. మేడిగడ్డకు ఎందుకు వెళ్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇంతకు ముందే మంత్రులు చూశారు. రేవంత్, రాహుల్ గాంధీ సైతం ప్రాజెక్టును పరిశీలించారు.. ఇప్పుడు మళ్లీ ఎందుకు వెళుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ- తీరు సైతం అలాగే ఉందన్నారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్.. నల్గొండ బహిరంగ సభకు వెళ్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టులపై పెత్తనం చెలాయిస్తుందని తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని... నాగార్జున సాగర్ డ్యామ్ పై ఏపీ పోలీసులు చేరి ముళ్లకంచెలు వేసి, తుపాకులతో ఆంధ్రా పోలీసులు ఉంటే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. 2014 చట్టం ప్రకారం.. ట్రిబ్యునల్ సమక్షంలోనే ప్రాజెక్టుల సమస్య పరిష్కారం కావాలని, కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదన్నారు. ఆంధ్రా రాష్ట్రం పోలీసులను పెట్టి బలవంతంగా నీళ్లు తీసుకుపోతే.. ఏం చేయాలో ఇప్పటి వరకు యాక్షన్ ప్లాన్ ఏంటో రాష్ట్ర ప్రభుత్వం చెప్పలేదన్నారు. రెండు నెలలైన మీ వైఖరి ఏమిటో చెప్పాలి? ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటారో చెప్పాలని.. మీరు పరిష్కరించుకుంటే.. కేంద్రం జోక్యం చేసుకోదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# చలో నల్గొండ కార్యక్రమానికి శంషాబాద్ నుండి భారీగా తరలిన బిఆర్ఎస్ శ్రేణులు



నల్గొండ సభకు బయలుదేరుతున్న శంషాబాద్ నాయకులు



సభా ప్రాంగణంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ గణేష్ గుప్తా తదితరులు



సభా ప్రాంగణంలో తమ అభిమాన నాయకురాలు సబితా ఇంద్రారెడ్డి ఫ్లెక్సీ దగ్గర శంషాబాద్ టిఆర్ఎస్ నాయకులు మల్లేష్, మేకల వెంకటేష్ తదితరులు

శంషాబాద్, ఫిబ్రవరి 13, (ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలో నల్గొండ ఉద్యమ సభకు శంషాబాద్ మండలం నుండి పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. రాజేంద్రనగర్ నుండి నాలుగవ సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రకాష్ గౌడ్ నేతృత్వంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు గణేష్ గుప్తా, శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్, మండల సీనియర్ నాయకుడు నీరటి రాజు ముదిరాజ్. మున్సిపల్ నాయకుడు కొలను మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పెద్ద సంఖ్యలో వాహనాలతో శంషాబాద్ నుండి ర్యాలీగా బయలుదేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణాజిల్లాల వాటాలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నదని దీనిపై ప్రజలను చైతన్యవంతం చేయడం కోసమే చలో నల్గొండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.




నల్గొండ సభలతో పార్టీ నాయకులతో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి

## కేసీఆర్ సభకు తరలిన రాజేంద్రనగర్ బిఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ పార్టీ చలో నల్గొండ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కు చెందిన రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో లోనే రాష్ట్ర ప్రగతి, పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు తో అధికారంలోకి వచ్చిందని ప్రజలు గమనిస్తున్నారని ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు మాదూరి ప్రభాకర్ రెడ్డి, రిటైర్డ్ ఏఎస్ఐ లు, బి ఆర్ ఎస్ నాయకులు పి జీవన్దాస్ , దాసరి రమేష్ ,మోహన్ రావు, రామకృష్ణ ,శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







90 శాతం పర్సంటైల్ కంటే ఎక్కువ వచ్చిన విద్యార్థులు

## జేఈఈ మెయిన్స్-1లో రాజేంద్రనగర్ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్ విద్యార్థుల ప్రతిభ

బుద్వేల్, ఫిబ్రవరి13(ప్రభాత ఉదయం) : రాజేందర్ నగర్ లోని గిరిజన ఐఐటి స్టడీ సెంటర్ లో చదువుతున్న విద్యార్థులు జే ఈ ఈ మెయిన్స్-1 లో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఐఐటి స్టడీ సెంటర్ కు చెందిన ఐదు మంది విద్యార్థులు 90% కంటే అత్యధిక పర్సంటైల్ సాధించారని స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. కె. వినోద్ 96.86 పర్సంటైల్ తో మొదటి స్థానంలో నిలిచారు. ఐదుగురు విద్యార్థులు 90 శాతం పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు, 8మంది విద్యార్థులు 80 శాతం పర్సంటైల్ కంటే ఎక్కువ, 11 మంది విద్యార్థులు 70 పర్సంటైల్ పైగా మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. 90 పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిలో కె. వినోద్, బి. సతీష్, బి. రాజ్ కుమార్, బి. భద్ర, ఎం. గణేష్ లు ఉన్నారు.

## రాజేంద్రనగర్‌లో పిచ్చి కుక్క స్వైర విహారం

### 14 మందికి గాయాలు



ఎం. రమేష్



ఎస్. రాజు

బుద్వేల్, ఫిబ్రవరి13(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ బస్తీలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రోడ్డుపైన వెళ్తున్న వారిని, చిన్న పిల్లలను, సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న వారిని కలిపి మొత్తం 14 మందిని కరిచింది. తనను కరిచిన కుక్క కనిపించడంతో దాన్ని ఎస్ రాజు అనే మేస్త్రి కొట్టి చంపేశాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయం పరిసరాల్లో ఉండే ఎస్ కె సింగ్(57) పాలు తీసుకురావడానికి వెళ్తుండగా పిచ్చికుక్క కరిసింది. అక్కడి నుంచి రోడ్డు గుండా వెళ్తున్న వాదిని సైతం కరిచి నార్మ్ వైపు వెళ్ళింది. నార్మ్ లో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న వారిని కరిచి అక్కడ నుంచి తిరిగి పోచమ్మ గుడి వైపు వచ్చింది. టీ విక్రయించే రమేష్ (35), సైకిల్ పై ఆడుకుంటున్న కౌశిక్ కుమార్(4) తో పాటు నరసింహ(55), ఎస్ రాజు (34) తదితరులను కరిసింది. మొత్తం 14 మందిని కరిసినట్లు తెలిసింది.

**కుక్క కరిచిన వాళ్ళు వీరే :**

రామకృష్ణ (49), రమేష్(35), భరత్ కుమార్(52), చెన్నయ్య (40), మల్లిక(22), అండాలు(35), నరేందర్(34), రజ్వీర్(25), బి యాదగిరి(50), షకీర్(22), రంగన్న(38), రాజు(34), కౌశిక్ కుమార్ (4), ఎస్ కె సింగ్ (57) లు కుక్క కరిచిన వారిలో ఉన్నారు .



ఎస్ కె సింగ్



కౌశిక్ కుమార్




శశాంక్ పుట్టిన రోజు సందర్భంగా...




కేక్ కట్ చేస్తున్న అప్పారెడ్డి గూడెం శశాంక్



## నేడు శంకరాపురం, ముచ్చింతలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

శంషాబాద్, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని ముచ్చింతల, శంకరాపురం గ్రామాలలో కొత్త విద్యుత్ లైన్లు వేయటానికి బుధవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని శంషాబాద్ విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 13.00 గంటల వరకు ,14.30 నుండి 16.30 గంటల వరకు శంకరాపురం, తొండుపల్లి, ఐ ఎం టి కళాశాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని కి సహకరించాలని ఆయన కోరారు.

## గోవాలో జరిగిన స్విమ్మింగ్ పోటీలలో సత్తా చాటిన అత్తాపూర్ వాసులు







రాజేంద్రనగర్,ఫిబ్రవరి13(ప్రభాత ఉదయం) గోవాలో జరిగిన జాతీయ జరిగిన స్విమ్మింగ్ పోటీలలో రాజేంద్రనగర్ అత్తాపూర్ డివిజన్ హైదర్ గుడకు చెందిన ఇద్దరు తమ సత్తాను చాటుకున్నారు.మాస్టర్స్ గేమ్ స్విమ్మింగ్ పోటీలో హైదర్ గుడకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి కొంగళ్ళ శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించారు.దీంతో నిర్వాహకులు ఆయనకు మంగళవారం మోడల్స్ అందజేసి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.మరోవైపు అదే ప్రాంతానికి చెందిన గంగిడి పుల్లారెడ్డి 100 , 200 మీటర్ల ఈత పోటీలలో రెండు మెడల్స్ సాధించారు.శ్రీనివాస్,పుల్లారెడ్డి ఇద్దరూ ఇప్పటికే మండల జిల్లా రాష్ట్ర స్థాయి ఈత పోటీలలో తన సత్తా చాటి మెడల్స్ సాధించారు. అప్రతిహాసంగా విజయ యాత్ర కొనసాగిస్తున్న ఇద్దరిని స్నేహితులు, స్థానికులతో పాటు ఆర్టీసీ అధికారులు అభినందించారు.త్వరలో జరగనున్న అంతర్జాతీయ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ప్రత్యేక ప్రోత్సాహం వల్ల తాను పోటీలలో పాల్గొని మెడల్స్ సాధించగలుగుతున్నానని శ్రీనివాస్ పేర్కొన్నారు.

## అబుదాబిలో అద్భుతమైన

# తొలి హిందూ దేవాలయం

## ప్రారంభించనున్న ప్రధాని మోదీ

అబుదాబి, ఫిబ్రవరి, 13 (ప్రభాత ఉదయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరబ్‌లో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల పాటు అబూదాబిలో పర్యటిస్తారు మోదీ. UAE రాజు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ భారత ప్రధానికి ఘనస్వాగతం పలికారు. రెండు దేశాల మధ్య పలు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. UAEతో భారత్‌కు ఎంతో అనుబంధం ఉందన్నారు మోదీ. భారత్ నుంచి బయలు దేరి యూఏఈ వెళ్లిన ప్రధాని మోదీకి షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహాన్ స్వాగతం పలికి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఎయిర్‌పోర్టులో అరబ్ సైన్యం సమర్పించిన గౌరవ వందనాన్ని ప్రధాని స్వీకరించారు. సోదరా అంటూ UAE అధ్యక్షుడిని సంబోధించిన ప్రధాని మోదీ, తనకు అందించిన స్వాగతానికి అభినందనలు తెలిపారు. గడిచిన ఐదు నెలల్లో తాను ఆయనను కలవడం ఇది ఏడోసారని గుర్తు చేశారు. UAEకి రావడం సొంతింటికి వచ్చినట్టుగా, కుటుంబసభ్యులను కలిసినట్టుగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. భారత్– UAE మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని మోదీ అన్నారు. జాయెద్ చొరవ వల్లే అబూధాబిలో హిందూ దేవాలయం రూపుదిద్దుకుందని మోదీ కొనియాడారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతుందని అన్నారు. ఈ సందర్భాంగా రెండు దేశాల అధికారులు రెండు దేశాధినేతల సమక్షంలో ఒప్పందాలను మార్చుకున్నారు. మోదీ గౌరవార్థం జాయెద్ స్టేడియంలో అహ్లాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భారతీయ సాంస్కృతిక కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. భారత్ నుంచి పలు రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనకు బయలుదేరే ముందు, ప్రధాని ఒక ప్రకటనను విడుదల చేశారు. ఇందులో మోదీ భారతదేశం-యుఎఇ, భారతదేశం-ఖతార్ మధ్య సంబంధాల గురించి వివరించారు. ఈ రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోదీ అబుదాబిలో నిర్మించిన తొలి హిందూ దేవాలయాన్ని కూడా ప్రారంభించనున్నారు. ప్రధాని మోదీ పర్యటనపై యూఏఈలోని ప్రవాస భారతీయుల్లో ఉత్సాహం నెలకొంది. గత తొమ్మిదేళ్లలో, యుఎఇతో భారతదేశ సహకారం వాణిజ్యం, పెట్టుబడి, రక్షణ, భద్రత, ఆహారం, ఇంధన భద్రత, విద్య వంటి వివిధ రంగాలలో అనేక రెట్లు పెరిగిందని అన్నారు. యుఎఇ కాలమానం ప్రకారం,



మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రధాని అక్కడ దిగనున్నారు. ఆ తర్వాత యుఎఇ దేశాధినేతతో పాటు పలువురు నేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. మోదీ రాక సందర్భంగా యూఏఈలో ఏర్పాటు చేసిన అహ్లాన్ మోదీ కార్యక్రమం ఈరోజు సాయంత్రం 6 గంటల నుంచి అబుదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో ప్రారంభం కానుంది. ప్రధాని మోదీ గౌరవార్థం నిర్వహించిన కార్యక్రమాల్లో 700 మందికి పైగా సాంస్కృతిక కళాకారుల ప్రదర్శన ఉంది. ఈ పర్యటనలో ప్రధాన మంత్రి షేక్ మహ్మద్ బిన్ రషీద్‌తో నా చర్చలు దుబాయ్‌తో బహుళ కోణాల సంబంధాలను బలోపేతం చేయడంపై దృష్టి పెడతాయన్నారు. యుఎఇ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో వివిధ అంశాలపై చర్చిస్తానని, ఇందుకోసం తాను చాలా ఆసక్తిగా ఉన్నానని ప్రధాని చెప్పారు. దుబాయ్‌లో జరగనున్న వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్ 2024లో ప్రధాని మోదీ గౌరవ అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేయనున్నారు. అహ్లాన్ మోదీ కార్యక్రమం జరగనున్న స్టేడియంలో దాదాపు 40 వేల మంది భారతీయులు హాజరుకానున్నారు. యూఏఈలో వర్షం కురుస్తున్నప్పటికీ భారతీయుల్లో మాత్రం ఉత్సాహం కొరవడడం లేదు. UAE దాదాపు 3.5 మిలియన్లతో అతిపెద్ద భారతీయ ప్రవాస సమాజాన్ని కలిగి ఉంది. ఇది దేశ జనాభాలో దాదాపు 35 శాతం. రెండు రోజుల UAE పర్యటన తర్వాత, ఫిబ్రవరి 14న ఖతార్ రాజధాని దోహాకు చేరుకుంటారు. దౌత్య సంబంధాలపై చర్చించడంతోపాటు.. అరబ్ నిర్మించిన మొదటి హిందూ



దేవాలయాన్ని కూడా మోదీ ప్రారంభించనుననారు. భారత్, యుఎఇ రెండూ పంచుకునే సామరస్యం, శాంతి సహనం విలువలకు UAE ఆలయం శాశ్వత అంకితం అవుతుందని ప్రధాని మోదీ అన్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, ఇది 2015 నుంచి యుఎఇకి ప్రధాని ఏడవ పర్యటన. 2014 నుండి ఖతార్‌లో రెండవ పర్యటన. వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2024లో ముఖ్య అతిథిగా వచ్చిన నహాయన్‌ని గుజరాత్‌లో నిర్వహించడం మాకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఖతార్, భారతదేశం మధ్య సంబంధాల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. భారత్, ఖతార్‌ల మధ్య చారిత్రాత్మకంగా సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. రెండు దేశాల మధ్య పెరుగుతున్న వాణిజ్యం, పెట్టుబడులు, మన శక్తి భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సంస్కృతి విద్యలో సహకారంతో సహా అన్ని రంగాలలో ఉన్నత-స్థాయి రాజకీయ మార్పిడిలు తీవ్రమయ్యాయి. ఆయన నాయకత్వంలో ఖతార్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని, మార్పును సాధిస్తోందని అన్నారు. ఖతార్‌కు సంబంధించి ప్రధాని మోదీ చేసిన ఈ ప్రకటన ముఖ్యమైనది. ఎందుకంటే ఖతార్ జైలులో ఉన్న ఎనిమిది మంది మాజీ భారత నావికాదళ సిబ్బందిని విడుదల చేసింది. వారిలో ఏడుగురు ఫిబ్రవరి 12న స్వదేశానికి తిరిగి వచ్చారు. ఖతార్ కోర్టు వారందరికీ మరణశిక్ష విధించగా.. భారత దౌత్యంతో ఖతార్ వారిని విడుదల చేసింది.




విద్యార్థులతో గద్వాల ఎస్పీ రితిరాజ్

## అవాంతరాలు అధిగమిస్తేనే లక్ష్యాన్ని చేరుతారు

### గద్వాల జిల్లా ఎస్పీ రీతిరాజ్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం)విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం కోసం చేసే ప్రయత్నంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని అధిగమిస్తే నే లక్ష్యాన్ని చేరుతారని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గట్టు మండలం బోయల గూడెం ప్రభుత్వ పాఠశాలలో 335 మంది విద్యార్థులకు వివేక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (భీమన్న) గద్వాల్ వారి ఆధ్వర్యంలో అట్లాస్, స్టడీ ప్యాడ్స్, జామెట్రీ బాక్స్, ఇంగ్లీష్ డిక్షనరీస్, జనరల్ నాలెడ్జి బుక్స్, వాటర్ బాటిల్స్ పంపిని కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరైన విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న మార్గం లో పోయే క్రమంలో ఎన్నో అవరోధాలు వస్తాయని వాటిని అదికమిస్తే నే లక్ష్యాలను చేరుకుంటారని జిల్లా ఎస్పీ రితిరాజ్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలో క్రమ శిక్షణ అలవర్చుకోవాలని, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని, లక్ష్య సాధనకు మెంటల్ గా దృఢంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుంటానని బాల్య వివాహాలు, కూలి పనులకు వద్దు అని తమ చదువుల పై తల్లిదండ్రులకు నమ్మకం కల్గించే బాధ్యతా విద్యార్థుల దేనని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమ చుట్టు ఉన్న సమస్యలను గుర్తించాలని అన్నారు. గురువుల కళలను ఫుల్ ఫీల్ చేయలని సూచించారు. మహిళలు విద్యను మధ్యలోనే వదిలేయవద్దు అని, ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగే వరకు కొనసాగించాలని కోరారు. వివేక్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ గురించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుమారు 40 వేల రూపాయాల విలువగల మెటీరియల్ అందించడం ఎంతో అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమకు ఉన్న సందేహాలను ఎస్పీ గారిని అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామంలో చాల మంది విద్యార్థులు డ్రాప్ ఔట్ కు గల కారణాలను ఎస్పీకి వివారించారు. విద్యార్థుల డ్రాప్ ఔట్, బాల్యవివాహాలపై పోలీస్ శాఖ దృష్టి సాదిస్తుందని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో గట్టు ఎస్సై రామ కృష్ణ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీదర్ రెడ్డి,ఎంటిఎస్ఎఫ్ లక్ష్మీ నారాయణ, సాగర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్‌కు ఎన్డీఎస్ఏ బృందం

### ప్రధాన డ్యామ్, స్పిల్‌వేలను పరిశీలించిన అధికారులు

### గేట్లు, సీపేజీ, మరమ్మతుల వివరాలపై, పరిస్థితులపై ఆరా

### నేడు కూడా కొనసాగనున్న పరిశీలన



నాగార్జునసాగర్, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం): 'నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)' బృందం మంగళవారం నాగార్జున సాగర్ ప్రాజెక్టును సందర్శించింది. తొలుత విజ యవిహార్ అతిథిగృహంలో తెలంగాణ, ఆంధ్ర ఇంజనీర్లతోపాటు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణాబోర్డు (కేఆర్ఎంబీ) సభ్యులతో ఎన్డీఎస్ఏ అధికారులు సమావేశమయ్యారు. 2009లో వచ్చిన భారీ వరదల నుంచి డ్యామ్‌ను ఏవిధంగా కాపా డారు? వచ్చిన వరదను ఎలా విడుదల చేశారన్న అంశాలపై చర్చించారు. తర్వాత ప్రధాన డ్యామ్‌ను, ప్రాజెక్టు లోపలి గ్యాలరీలను, అక్కడి సీపేజీ (జాలు నీరు)లను పరిశీలించారు. సీపేజీ నీటి మళ్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రా జెక్టు స్పిల్‌వేపై ఉన్న వాక్‌వే బ్రిడ్జి మీదుగా వెళ్లి స్పి ల్‌వేను పరిశీలించారు. ప్రాజెక్టు గేట్ల పరిస్థితి, స్పిల్ వేకు అవసరమైన మరమ్మతులు, నిర్వహణ వివరాలను ఆరా తీశారు. స్పిల్‌వే దిగువన బకెట్ పో ర్షన్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎన్డీఎస్ఏ బృందంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్‌డీఎస్‌వో) సీఈ ప్రమీల, ఇత ర ఇంజనీర్లు ఉన్నారు. ఈ పరిశీలనలో తెలంగాణ నుంచి చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్, డ్యామ్ ఎస్ఈ పీవీఎస్ నాగేశ్వర్‌రావు, ఇతర ఇంజనీర్లు పాల్గొనగా.. ఏపీ నుంచి చీఫ్ ఇంజనీర్ మురళీధర్ రెడ్డి, ఎస్ఈ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ కేంద్రం పరిశీలన

ఎన్డీఎస్ఏ బృందం బుధవారం సాగర్ డ్యాం దిగు వన ఉన్న విద్యుత్ కేంద్రాన్ని సందర్శించనుంది. ఈ విద్యుత్ కేంద్రం ద్వారా విడుదలవుతున్న నీటి ని.. తిరిగి జలాశయంలోకి ఎత్తిపోసే సమయంలో నీరేమైనా వృథా అవుతుందా? సీజన్‌లో బయటికి ఎంతనీరు వెళుతుందనే అంశాలను పరిశీలించనున్నట్టు తెలిసింది. గురువారం కూడా సాగర్ ప్రాజెక్టు పరిధిలో పరిశీలన కొనసాగనుంది.



బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న చిట్టి శ్రీధర్ రెడ్డి

## వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి

### ఘనంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 13 (ప్రభాత ఉదయం) జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం 53వ కల్యాణోత్సవం సందర్భంగా దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి మంగళవారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలో పాల్గొని స్వామి వారిని దర్శించుకునారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి ని దేవాలయ ధర్మకర్త గుజ్జల పాపిరెడ్డి ఇతర దేవాదాయ కమిటీ సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో కార్యక్రమంలో గుజ్జల పాపిరెడ్డి, కే నరేందర్ రెడ్డి,రొండ్ల మహేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సంజీవరెడ్డి,గణేష్,బుచ్చిరెడ్డి, వీరారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,వెంకటరెడ్డి, కమిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పవిత్ర మక్కాకు బయలుదేరిన

## కొత్తకోట పట్టణ ముస్లిం సోదరులు

### శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు




కొత్తకోట, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం): కొత్తకోట పట్టణం 11వ వార్డుకు చెందిన సద్దాంఖురేసి, నిజాముద్దీన్ ఖురేషి , ముస్లిం సోదరులు పవిత్రమైన మక్కా కు వెళ్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు 11 వ వార్డు ఇన్చార్జి , కో ఆప్షన్ మెంబర్ జెఎం మిషెక్ పూలమాలవేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ఎస్సీ సెల్ పల్లెపాగు ప్రశాంత్, జిల్లా నాయకులు బోయెజ్, వేముల శ్రీనివాసరెడ్డి, కొత్తకోట పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీనన్న , ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, జెసిబిరాములు, సలీం, లతీఫ్, హరీష్ రెడ్డి, రాములు యాదవ్, తయాబ్, ముజీబ్, అంజన్న యాదవ్, బక్కరెడ్డి, నాగిరెడ్డి, జె కర్ణ, వడ్డే శీను, అజ్జు, ఆరిఫ్, అభిద్, ఎన్ ప్రసన్న, బి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న జగదీశ్వర్ గౌడ్

## ప్రజల మధ్య ఉంటా సమస్యలు పరిష్కరిస్తా

### శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 13 (ప్రభాత ఉదయం) అల్విన్ కాలనీలో డివిజన్ పరిధిలోని జయశంకర్ నగర్ బస్తీలో పర్యటించి స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు వి.జగదీశ్వర్ గౌడ్, ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి సమస్యను ప్రజలు జగదీశ్వర్ గౌడ్ దృష్టికి తీసుకురాగా మంగళవారం ఆయన వారి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలు ప్రభుత్వం మధ్య సమస్యలను తీర్చే వారధిగా నిలుస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్, మనెపల్లి సాంబశివరావు, శేషు, శిరీషా సత్తుర్, రవి, రఫిక్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

## బిఆర్ఎస్ తలపెట్టిన చలో నల్గొండ సభకు తరలిన కొత్తకోట మండల పార్టీ నాయకులు




మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి తో బి ఆర్ ఎస్ నాయకులు

కొత్తకోట, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం) కృష్ణా జలాలపై తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ తన పెట్టిన నల్గొండ సభకు కొత్తకోట మండల బిఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మంగళవారం కేసీఆర్ పిలుపుమేరకు ఛలో నల్గొండ సభలో దేవరకద్ర మాజీ శాసన సభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్ ,రానిపేట సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ,మాజీ ఎంపీటీసీ సంజీవులు ,పరమేష్ , తదితరులు పాల్గొన్నారు .



## క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు

### బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్

### కబడ్డీ టీం క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేత

గద్వాల , ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం) గద్వాల నియోజకవర్గం పరిధిలోని కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో కబడ్డీ జూనియర్ జట్టు క్రీడాకారులకు అవసరమైన టీషర్ట్స్ తో పాటు కిట్స్ లను కేటిదొడ్డి మండలం బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఈ.వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...గ్రామీణ స్థాయిలో నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించి ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, బహదూర్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి సిద్దప్ప, రుద్రప్ప, వెంకటప్ప, లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.